# బీజగణితం

డాక్టర్ పరుచూరి రాజారామ్



**"మృదులా! నన్ను పిచ్చివాణ్ని చెయ్యొద్దు! అర్థంచేసుకో! ఊరికే గతం తవ్వి లాభంలేదు."**

**—మాటలు గబగబా దొర్లుతున్నాయి.**

"నీ ఇంట్లో నీకూ నా ఇంట్లో నాకూ కనిపించని కటకటాలు పెట్టారు. రహస్యంగా కలుసుకోవడానికైనా అవకాశం లేదు. దొరక్క దొరక్క ఇన్నాళ్ళకి ఈ అవకాశం దొరికింది. ఈ క్షణాలని వృథా చెయ్యొద్దు!" కోమలంగా వున్న మృదుల చేతుల్ని తన చేతుల్లో పెట్టుకుని ఆతృతగా, భయంగా, బెంగగా, గద్గదంగా అంటున్నాడు సురేష్


మృదుల మౌనంగా స్థాణువులా నించున్నది. తళతళలాడే మృదుల కళ్ళల్లోకి చూస్తూ ఒక క్షణం తనను తాను మరచిపోయి మాట్లాడటం ఆపేశాడు మరుక్షణమే ఈ అవకాశం మళ్ళీ యుగాల దాకా రాగని తెలిసి మేలుకున్నాడు.

"మృదులా! ప్లీజ్.... మృదులా.... నన్నర్థం చేసుకో!"

"నిన్నా? నీ పిరికితనాన్నా?" కటువుగా అంది మృదుల

షాక్ తిన్న సురేష్ తెప్పరిల్లి. "ఇదన్యాయం మృదులా. నువ్వే నన్ను కసిరికొట్టావు. అందుకే ఏం గోలచేస్తావోనని నీ కిష్టం లేదేమోననుకొని నువ్వు ఆహ్వానించినా ఆనాడు అర్థం చేసుకోలేకపోయాను. దురదృష్టవంతుణ్ణి. అందుకిన్నేళ్ళు శిక్ష?"

మృదుల మాట్లాడలేదు. కాస్త మెత్తబడినట్లనిపించి- సురేష్ మళ్ళీ పుంజు




కున్నాడు. కోరిక తీవ్రమై గొంతుపూడి పోతున్నది.

"మృదులా! నువ్వు నమ్మవు. నమ్మ లేవు. నన్నర్థం చేసుకో మృదులా !...."

అంతలోనే ఏమైందో—

"ఏమిటీ పాడుగోల. ఛీ!" అని చేతులు విదిలించుకుంది మృదుల.

ఇంత భంగపాటు ఎన్నడూ ఎరగడు. కోరికే పడగ విప్పిందో పంతమే పెరిగిందో.

"నువ్వు నాకు రాసిన ఉత్తరాలు చెప్తాయి ఎవరెవరి కన్యాయం చేశారో. నువ్వు రాయలేదూ నేను నీదాన్నని. ఇంక నీ ఇష్టం నన్నేమైనా చేసుకో అని...." ఆతృతా తపనా కోపమె దోషిని నిలదీసి నట్లుగా అడిగాడు సురేష్.

నిజమాడితేనిష్ఠురం. మృదుల కోపంతో వూగిపోయింది. ఉత్తరాలు రాసింది నిజమే. అందుకే ఏం చెప్పాలో తెలియక "రాస్తే రాశాను. ఇప్పుడేమిటంటావ్ ?" అంది.

సురేష్ చల్లబడ్డాడు.

"అందుకే ఒక్కసారి ఈ ఒక్కసారి నన్ను కాదనకు...." సురేష్ చేతులు మృదులను పొదువుకుంటున్నాయి.

నడుముని చుట్టుకుంటున్న చేతుల్ని దూరంగా తోసేసింది.

"ఇలాగే చేశావంటే అరుస్తాను!"

నీరుకారిపోయాడు సురేష్. ఒకడుగు వెనక్కి వేసి "పోనీ ఒక్కమాట చెప్పు. నేను నీ జోలికి రాను. నువ్వంటే నా కసహ్యమని ఒక్కమాట అను!"

ఒక్క నిముషం ముందే 'ఛీ' అన్నా సురేష్ తలకెక్కలేదు ఇప్పుడు 'తన కసహ్యం' అని చెప్పమంటున్నాడు. ఆ మాట అనలేదు మృదుల. మౌనంగా వుండిపోయింది.

"బ్లాక్ మెయిల్ చేస్తాననుకుంటున్నావా? నువ్వు రాసిన ఉత్తరాలు నీ క్షేమంకోరే ఎప్పుడో తగలేశాను. కనుక బ్లాక్ మెయిల్ చేస్తానని భయపడకు. నేనంత నీచుడిని కాదు. నువ్వంటే నా కసహ్యమని ఒక్క మాట అను. ఇంక నీ జోలికి రాను."

"సరే విను! ఇంకెప్పుడూ నన్ను పలకరించకు. నువ్వంటే నా కసహ్యం" చరచరా వెళ్ళిపోయింది.

లయతప్పిన గుండె అతివేగంగా కొట్టుకుంటుంటే కుప్పకూలిపోయాడు సురేష్.

ఎన్నడూ ఏ స్త్రీనీ యాచించలేదు. 'ఛీ' అనిపించుకోలేదు. మరచిపోయి రాజీపడి బతుకుతుంటే ఉత్తరాలు రాసి కోరి కోరి రెచ్చగొట్టి ఇప్పుడు ధర్మపన్నాలు వల్లిస్తోంది. పాతివ్రత్యం కాబోలు. సురేష్ గుండె మండిపోతోంది. మనసా తిట్టుకున్నాడు. బూతులు తిట్టుకున్నాడు. ఇలాంటి అల్పప్రాణి కోసం ఆరాటపడి అన్నింటినీ ధ్వంసం చేసుకున్నాననుకున్నాడు. ఆడదానికి ఏ మగాడైనా ఒకటే. సౌందర్యాన్నారాధించే వాడైనా ఒకటే. గోపీచంద్ కథలో లాగ అర్థరాత్రి మొద్దు నిద్దట్లో కాలు గోకేవాడైనా ఒకటే అనుకున్నాడు. 'దాని' స్మృతిని తొక్కివట్టాలనుకున్నాడు. అసహ్యించుకోవాలనుకున్నాడు.

* * *

చలపతి ఇంకా ఇంటికి రాలేదు. ఏం పొద్దు పోవటంలేదు. ఇంట్లో కాలం గడవడం లేదు. ఇద్దరికీ వుడకేసి పడెయ్యటానికి అరగంట సరిపోతుంది. మిగతా రోజంతా ఎలా గడపాలో తెలియదు. అప్పటికీ అద్దె పుస్తకాల షాపుకు డబ్బు కట్టి ఇంటికి పుస్తకాలు తెప్పించుకుంటున్నది. వెధవ పుస్తకాలు చదివీ చదివీ విసుగెత్తిపోతున్నది. ఇరుగిళ్ళకూ పొరుగిళ్ళకూ పోవటం మానుకున్నది. ఏ పేరంటానికనో ఎప్పుడైనా ఏ కొంపకైనా వెళ్తే.

"ఏం మృదులా నీతోపాటు పెళ్ళైన వాళ్ళందరూ ఇద్దరు ముగ్గురిని కన్నారు. మరి నువ్వెపుడు?" అంటుందొకత్తె ఆప్యాయంగా.

"ఏమోలేమ్మా! చదువుకున్నవాళ్ళు గదా! ఏ బిళ్ళలన్నా మింగుతున్నారేమో!" అంటుందింకొకత్తె.

పాకుతున్న పసిపిల్ల పొరపాటున గొడ్రాలి చేతిలో కెక్కుతుందేమోనని, మృదుల వేపు పాకుతున్న పసిబిడ్డని గభాలున ఒళ్ళోకి లాక్కుంటుందింకో తల్లి!

ఎవరింటికీ వెళ్ళకుండా మానేసి, ఇంట్లోనే కూర్చుందామా అంటే చలపతి వేళకు కొంపకు రాడు. ఎప్పుడూ స్నేహితులూ, షికార్లూ, వ్యాపారాలూ, డ్రింకు పార్టీలు. ఇంట్లో వున్నంతసేపూ వూపిరాడనీయకుండా నలిపేస్తాడు.

ఏమీ తోచని మృదుల చలపతి టేబుల్ మీద దుమ్ము దులుపుతూ కాగితాలు సర్దుతూ డ్రాయర్ తెరిచింది. ఒక వేపున విడిగా ప్రత్యేకంగా ఒక కవరుంది. ఏమిటోనని తెరచి చూచింది. క్లినికల్ లేబరేటరీ రిపోర్టు. చలపతికి పరీక్షలెందుకు అవసరమైనాయో ఏం పరీక్షలో అర్థం కాలేదు. క్యూరియాసిటీతో తెరచి చూసింది.

సీమెన్ ఎనాలిసిస్! అందులో రాసి వున్నది ఏమీ అర్థం కాలేదు. తెలిసిందల్లా చలపతి తన స్పెర్మ్‌లో ఏముందో తెలుసుకునే పరీక్ష చేయించుకున్నాడు. దాని పర్యవసానం ఏమిటో మాత్రం తనకు తెలియలేదు. ఇంత గోప్యంగా ఎందుకు వుంచాడో! తనకెప్పుడూ చెప్పనైనా చెప్పలేదే అనుకుంది మృదుల.

ఒక నెల క్రితమే లేడీ డాక్టర్ దగ్గర కెళ్ళింది తను. ఇంటి ప్రక్కల అమ్మ లక్కల సూటీ పోటీ మాటలు వినలేక. ఆమె పరీక్షలన్నీ చేసి ఏమీ లోపంలేదని చెప్పింది. ఒకసారి చలపతిని కనపడమని కూడా చెప్పింది. ఆమె ఎందుకు రమ్మ న్నదో ఏమిటో అడిగి తెలుసుకోనేలేదు. ఆమె పరీక్ష చేయించుకోమని చెప్పిందా? అయితే దాన్ని తనకేమీ చెప్పకుండా ముఖ్యమైన వ్యాపారం కాగితాలుండే చోట ఎందుకు దాచినట్లు?

మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఒంటి గంటే అయింది. ఇంకా లేడీ డాక్టర్ నర్సింగ్‌హోమ్‌లోనే వుంటుంది. తల దువ్వుకుని బొట్టు సరి చేసుకొని గబ గబా బయటికొచ్చింది మృదుల. ఇంటికి తాళంవేసి రిక్షా ఎక్కి 'లలితా నర్సింగ్ హోమ్' అంది.

"ఏం మృదులా! ఈ వేళప్పుడు వూడిపడ్డావ్?" అంది ఇంటికెళ్ళబోతున్న డాక్టర్.

సిగ్గుతోనూ ఒకలాంటి భయంతోనూ తల వంచుకున్నది మృదుల. అనుభవం పేరుకున్న డాక్టర్ నర్సుకేసి చూసింది. ఆమె మౌనంగా బయటికెళ్ళింది.

"ఏమిటో చెప్పు!" అంది డాక్టర్.

"ఈ రిపోర్టు గురించి ఏమైనా చెప్తా రేమోనని " తల దించుకుని మెల్లగా అంది మృదుల.

సానుభూతి నిండిన కళ్ళతో చూసింది డాక్టర్.

"ఏముంది మృదులా! నిన్ను పరీక్ష చేశాను గదా, నీకే లోపమూలేదు అందుకే మీ ఆయనను ఈ పరీక్ష చేయించుకో మన్నాను. దీని ప్రకారం దాదాపుగా అతడికి సంతాన యోగ్యత లేనట్లే!"

"ఈ మాట వారికి చెప్పారా?"

డాక్టర్ ఒక క్షణం మాట్లాడలేదు. "ఇంకా చెప్పలేదు. ఒక్కసారిగా చెప్పి అతణ్ణి హతాశుణ్ణి చేయలేము. ఏమైనా మార్పులొస్తాయేమోనని కొన్ని మందులు వాడమన్నాను. ఎప్పుడో నూటికి కోటికి ఒకరికి అవి వుపయోగపడతాయి. ముందు గానేచెప్పి అతణ్ణి క్రుంగదీయటం భావ్యం కాదు."

మృదుల మనసులో వంద ఆలోచన్లు.

"థాంక్యూ డాక్టర్‌గారూ! మరి నే వస్తా" అంటూ లేచింది.

"డోంట్ వర్రీ విష్ యూ ఆల్ ది బెస్ట్!" అంది డాక్టర్.

* * *

'సురేష్! నేనేమిటో నాకే తెలియదు. నువ్వంటే నాకసహ్యమని ఎట్లా అనగలి గానో నాకే తెలియదు. కన్ను మూసినా కన్ను తెరిచినా నా కళ్ళ ముందు ఎపుడూ నువ్వే! నువ్వు నా కోసమే బ్రతికివున్నా వని నాకు తెలుసు. కానీ ఎందుకో నువ్వంటే కసి. నీ జీవితం ఇంకోళ్ళు పంచుకున్నారు. ఆ తరువాతనే మన పరి చయం. అందులో నీ తప్పులేదు. నేను మాత్రం బలి పశువులా తలవంచి మనసు లేని మనువాడ లేదా?

అయిందేదో అయిపోయింది. నేను


మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు!

డిస్ట్రిబ్యూటర్స్:
★ రాకోల్డ్ ఎలక్ట్రికల్ అప్లయిన్సెస్

డీలర్స్:
★ ఫిలిప్స్ రేడియోలు
★ ఫిలిప్స్ మిక్చర్స్
★ ఖైతాన్ ఫ్యాన్స్
★ ఉషా ఫ్యాన్స్
★ కూల్ హోమ్ ఫ్యాన్స్
★ ఓరియంట్ ఫ్యాన్స్
మరియు
★ ర్యాలీ ఫ్యాన్స్

గమనిక: సుమీత్ ఆథరైజ్డ్ సేల్స్ & సర్వీసింగ్ సెంటర్.




Sumeet®
every kitchen needs one!

ఆథరైజ్డ్ సేల్స్, సర్వీసింగ్ డీలర్: ఫోన్: 76223
దుర్గా రేడియో ఎలక్ట్రానిక్స్
బీసెంట్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ-2
BABU ADS
devar

## ఇదొక అందము!

సిగ్గు బిళ్ళను తెచ్చినారము
సిగ్గు ఎవరికొ తెలుపుడీ!
కట్టి పోదుము పదుగురెదుటను
మొలకు సరిపడునట్టుగా!

తమిళ తెలివిని ప్రదర్శించే
తెలుగువాళ్ళను చూసినప్పుడు!
మఘను పుట్టిన కొత్త పార్టీ
పుబ్బ లోపున మాడినప్పుడు!



రక రకమ్ముల రంగులేనే
రాజకీయం ప్రబలినప్పుడు!
పిచ్చివాళ్ళకు; చచ్చినోళ్ళకు
ఓట్లు పడి పదవొచ్చినప్పుడు!

ఇట్టి బిళ్ళలు కట్టవలెనని
చేసితిమి తీర్మానము!
ఇంత వరకును ఎవ్వరెవరికి
కట్టలేదీ బిళ్ళలు!

దేశమంతయు వెదకుచుంటిమి
సిగ్గు గలిగిన వారికై
ఒక్కడయినను దొరకడాయెను
అక్కటా యిది ఏమిటో?

ఇవిగో! వున్నవి సిగ్గు బిళ్ళలు!
కట్టవలయును! కట్టవలయును!
సిగ్గు ఎగ్గులు వున్నవాడా
ఎక్కడా? ఏ మూలరా?

(త్రిపురనేని రామస్వామిగారి
'వీరగంథము' గేయానికి పారడీ)

—జొన్నవిత్తుల
రామలింగేశ్వరరావు

---

నీ దాన్నే.... నీ దాన్నే.... నీ ఇష్టం.

పన్నెండో తేదీ చలపతి వూళ్ళో వుండడు.

నీ
మృదుల

ఉత్తరం చూసి ఆశ్చర్యపోయాడు సురేష్. ఒక్క మృదులేనో లేక ఆడవాళ్ళంతా ఇంతేనో అతనికి అర్థంకాలేదు. ఇద్దరూ రాజీపడి బ్రతుకుతున్న వాళ్ళే. ఎవరి సంసారం వాళ్ళకి వున్నట్లే ఇద్దరికీ కోరికా వుంది. తనను 'ఛీ' అన్న నాటికీ నేటికీ ఎందులోనూ మార్పురాలేదు. ఏమీ తేడా లేదు.

ఏమైనా తన కలలు పండుతున్నాయి. తప్పో ఒప్పో నీతో. అవినీతో మృదులతో అనుభవం రాకపోతే నరాలు ఛిద్రమై పిచ్చెక్కేలా వుంది.

తపసు ఫలించబోతున్నది. సురేష్‌కు రాత్రిళ్ళు నిద్రపట్టడం మానేసింది. కళ్ళు మూసినా కళ్ళు తెరిచినా మృదులే కనబడుతోంది. సింగారం అంగాల్లోవున్న రోజుల్నించీ పేరుకున్న కోరిక సెగలు కక్కుతోంది. ఏం తిన్నాడో ఏం తాగాడో పన్నెండో తారీఖుదాకా అతడికే తెలియదు. భూమిమీద లేడు.

పన్నెండు రాత్రి ఆఫీసు పనిమీద విజయవాడ వెళుతున్నాననీ ఇంటికి రాననీ చెప్పాడు. వెళ్ళేప్పటికి మృదుల కాచుకుని వుంది. అయితే సురేష్‌కోసం తపిస్తూ రాసిన ఉత్తరంలోలాగున లేదు. ఎక్స్‌ట్రా మెరైటల్ లవ్ తాలూకు థ్రిల్‌గానీ, ఉద్రేకంగానీ ఏమీలేవు. లేవని గమనించినా వాటిని పట్టించుకునే స్థితిలో లేడు సురేష్!

క్షణాలలో ఆమె జడత్వం మాయమైంది. కోరుకున్న పొందు దొరికిన ఆనందం ఇద్దరిలో పొంగులు వారింది. కలవరించి కలవరించివున్న సురేష్‌కు అప్పుడే ఆ రాత్రి అయిపోయిందా అనిపించింది.

"మళ్ళీ ఎప్పుడు?" అడిగాడు.

"చలపతి కేంప్ కెళ్ళినపుడు నేనే రాస్తానులే" అంది మృదుల.

ఈ మార్పేమిటో ఆహ్వానాలేమిటో అడగాలనిపించింది. కానీ ఇదివరకటిలా మళ్ళీ "ఛీ" అంటుందేమో ననిపించి అడగలేదు.

చలపతి కేంప్‌ల కెళుతున్నాడు. సురేష్ మృదులకోసం వెళుతున్నాడు.

విచిత్రంగా మృదులలో అసహనం చోటుచేసుకుంటున్నది. మనిషిలో ఇదివరకటి వేడిలేదు. అనుభవం పాతబడిపోయిందేమోననిపించింది.

ఆ రోజు వరండాలోనే కుర్చీలు వేసింది! సురేష్‌ని వంటిమీద చెయ్యయినా వేయనివ్వలేదు. మళ్ళీ ఏమొచ్చిందో అనుకున్నాడు. ఎంతో మౌనంతర్వాత సురేష్ ఎడ్వాన్స్‌లను నిరోధించింతర్వాత తిరస్కరించిన తరువాత చాలా యాధాలాపంగా అడిగింది.

"సురేష్! నీకు పిల్లలెంతమంది?"

"ఇద్దరు. పెద్దపాపకు ఏడేళ్ళు: బాబుకు అయిదేళ్ళు. ఎందుకు?" అడిగాడు సురేష్

అతడికి ఇంకా కోరిక చావలేదు. సైమంతా వేస్టయిపోతోందని బాధగా వుంది.

"ఎందుకు" అని అడిగిన సురేష్‌కు సమాధానం ఇవ్వకుండా—

"తరువాత ఇంక వద్దనుకున్నారా ఏం?" అనడిగింది.

"నేను వేసెక్టమీ చేయించుకున్నాను. ఇంకెంతమందిని పోషించగలను?" అన్నాడు సురేష్.

మృదుల గభాలున లేచింది. ఒక్కపుదుటున వరండాలోంచి ఇంట్లోకి దూరి దభేలున తలుపు మూసేసింది. ఏమీ అర్థంకాని సురేష్ "మృదులా....మృదులా...." అంటూ తలుపు తట్టాడు. లోపల్నించి ఎక్కిళ్ళుపెడుతున్న శబ్దం వినిపించి ఒక్కక్షణం ఆగి మళ్ళీ తలుపు తట్టాడు. ఎక్కిళ్ళు పెద్దగానే వినిపిస్తున్నాయి. తలుపుకొట్టి మృదులా మృదులాఅన్నాడు.

"ఛీ—పో! ఇంకెప్పుడూ రాకు!"

"మృదులా! మృదులా! తలుపు తియ్- ఏమైందో చెప్పు!" ఆందోళనగా బయటి నుంచి అడిగాడు సురేష్.

"ఏం చెప్పనక్కర్లేదు! పో! ఇంకెప్పుడైనా వచ్చావా అరుస్తాను. గోల చేస్తాను. అందర్నీ పిలుస్తాను! పో! వెళ్ళిపో!" గొంతు బొంగురుపోతుండగా అరిచింది మృదుల.

దిగులుగా బెంగగా వెనుదిరిగాడు సురేష్.

మంచంమీద బోర్లాపడి దిండులో తల దూర్చి ఎక్కిళ్ళుపెడ్తోంది మృదుల.

(రిస్కుండదు పాత కథల్లోని పాలేరువాడే నయం!)